

25 నాటు తుపాకీలు స్వాధీనం

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి, జికెవీధి, కొయ్యూరు మండలాల్లో 25 నాటు తుపాకీలు పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు చింతపల్లి అదనపు ఎస్‌పి ప్రతాప్ శివకిశోర్ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో గిరిజనులు దగ్గర ఉన్న నాటు తుపాకులు తమకు అప్ప చెప్పాలని, వారిపై ఎటువంటి కేసులు ఉండవని తెలిపారు. ఎవరైనా నాటు తుపాకితో పట్టుబడితే సుమారు రూ.10 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఇంకా ఎవరైనా నాటు తుపాకులు కలిగి ఉంటే వెంటనే తమకు స్వాధీన పరచాలని కోరారు.



మాట్లాడుతున్న ఎఎస్‌పి

కించుమండలో అక్రమ కట్టడాలు

-పట్టించుకోని అధికారులు - యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్న గిరిజనేతరులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని కించుమండలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలు జోరుగా జరుగుతున్నాయి. 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు రోడ్డు పక్కనే ఉన్న ఆర్ అండ్ బి స్థలాల్లో శాశ్వత షాపుల అక్రమ కట్టడాలను నిర్మించుకుంటున్నారు. గతంలో ఈ స్థలాల్లో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగించేవారు. ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణ తరువాత 1/70 చట్టానికి విరుద్ధంగా శాశ్వత షాపులను నిర్మించు కుంటున్నారు. అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగించే జాతీయ రహదారికి అనుకుని అక్రమ కట్టడాలు జరుగుతున్నా పంచాయతీ అధికారులు కళ్లకు కనబడకపోవడం విశేషం. అధికారులు అక్రమ కట్టడాల నిలుపుదలకు చర్యలు తీసుకోకపోవడంతో గిరిజనేతరుల అక్రమ కట్టడాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదని స్థానికులు, పలు ప్రజా సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. జీవనోపాధి కోసం రోడ్డు పక్కన ప్రభుత్వ భూముల్లో తాత్కాలిక దుకాణాలు నిర్మించుకుంటే వెంటనే స్పందించి తొలగించే అధికారులు, గిరిజనేతరులు దర్జాగా శాశ్వత దుకాణాలు నిర్మించుకుంటున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఈ విషయంపై ఆర్ఐ హరిని వివరణ కోరగా కించుమండలో గిరిజనేతరుల దుకాణాలు పరిశీలించి నిలుపుదలకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



అక్రమంగా నిర్మాణం చేపట్టిన షాపు



గిరిజన యువకులతో మాట్లాడుతున్న లోతా రామారావు

గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

పర్యాటక ప్రాంతంలో గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు డిమాండ్ చేశారు. మారేడుమిల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో సిపిఎం బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ గిరిజన సంస్కృతి సంప్రదాయాలు కాపాడవలసిన అవసరం ఉందన్నారు. టూరిజం అభివృద్ధి చెందుతుండంతో వేలాది మంది పర్యాటకులు ఈ ప్రాంతానికి వస్తున్నారని, కాని ఇక్కడున్న గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న జీవవైవిధ్యాన్ని కాపాడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. టూరిజం ద్వారా వస్తున్న నిధులు గిరిజనుల అబివృద్ధికి ఖర్చు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. టూరిజం ద్వారా వచ్చిన నిధులు 25శాతం ఈ ప్రాంతంలో గిరిజనుల అభివృద్ధికి ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మారేడుమిల్లి మండలం ప్రజలు ఆదివాసీ భవనం ఏర్పాటు చేయాలని అనేకసార్లు ప్రభుత్వానికి విన్నవించినా శ్రద్ధ చూపడం లేదన్నారు. వెంటనే ఆదివాసి భవనం నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి, సిపిఎం మండల నాయకులు ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి, కత్తుల గంగిరెడ్డి, వీకా రాజన్న దొర, సిపిఎం సోషల్ మీడియా సహాయకులు జర్త రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం బలపరిచిన అభ్యర్థులను అరకు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఉమా మహేశ్వరరావు పిలుపునిచ్చారు. బుదవారం అరకువేలి మండల సిపిఎం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఆదివాసుల హక్కులు, చట్టాల రక్షణకై సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. గిరిజన ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. పోడు పట్టాల సాధనకు, మంచినీరు, రోడ్డు, గిరిజనులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలకు సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. జీవో 3కి చట్టబద్ధత, 100శాతం ఉద్యోగ అవకాశాలు, 1/70 చట్టం పట్టిష్ఠంగా అమలు చేయాలని దశలవారీగా అనేక పోరాటాలు చేస్తుందని తెలిపారు. గిరిజన ప్రాంతంలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపితో భవిష్యత్తులో ముప్పు ఉందన్నారు. వైసిపి, జనసేన, టిడిపి పార్టీలు బిజెపికే మద్దతు పలుకుతూ గిరిజనులకు ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపించాలని పిలుపునిచ్చారు. ప్రచారం చేసి ఆదివాసి గిరిజనుల్లో చైతన్యం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, వివి జయ, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మేలి చిన్నబాబు, పద్మాపురం ఉపసర్పంచ్ జన్ని బాగత్ రామ్, సిపిఎం మండల కమిటీ సభ్యులు గత్తుం బుజ్జిబాబు, పి.బాలదేవ్, పాంగి రామన్న, కె.మొద్దు, టి.జోషి, అప్పన్న, కొగేష్, అప్పలస్వామి, సిహెచ్ గురుమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

నిరంతరం ప్రజల పక్షాన పోరాం

-జడ్పిటిసి గంగరాజు

అనంతగిరి: నిరంతరం ప్రజా పక్షాన నిలబడి పోరాటం చేసే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని అనంతగిరి జడ్పిటిసి గంగరాజు కోరారు. మండలంలో రాజుపాక గ్రామంలో ఆయన మాట్లాడుతూ,లక్ష్మీపురం జంక్షన్ మంచి రాజుపాక వరకు బీటి రోడ్డు, రాజుపాక నుండి డేకాపురం, హుకుంపేట మండలం పటకదవడ వరకు కలెక్టివిటీ పాడేరు ప్రాజెక్టు కింద రూ రెండు కోట్ల నలభై లక్షలతో రోడ్ల పూర్తయ్యాయని, మెటల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తనను ప్రజలు గుర్తించి జెడ్పిటిసిగా గెలిపించడంతో ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గానికి కృషి చేశానని ఆయన స్పష్టం చేశారు. మరికొన్ని గ్రామ సమస్యలను గుర్తించి నిధులకు ప్రతిపాదనలు చేసి అధికారులకు పంపించడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేత జె.రామన్న, మహిళా సంఘం నాయకురాలు దేముడమ్మ, డి.శ్రావణి, జె దేవి, గ్రామస్తులు డీ.లచ్చు, బీమ్మన, రాజు, లక్ష్మణ్, సింహాద్రి పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందుకు పలు సంస్థలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ ప్రాంగణంలో రాజమండ్రి ఓయన్‌జిసి ఆర్థిక సహాయం రూ.13 లక్షలతో కొనుగోలు చేసిన అంబులెన్‌ను ఓఎన్జిసి ఇడి అసిస్టెంట్ మేనేజర్ సనాతను దాస్ ప్రారంభించి, ఎడియంహెచ్‌ఒకు అప్పగించారు. ఈ సందర్భంగా ముందుగా ఏపీవో జనరల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించే విధంగా అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ఓఎన్జిసి అధికారులకు గతంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ప్రతిపాదనలు సమర్పించారని, దీనికి స్పందించిన ఆ సంస్థ రూ.13 లక్షలతో అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినందుకు ఐటీడీఏ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. ఓఎన్జిసి ఇడి ఓఎన్జిసి అసిస్టెంట్ మేనేజర్ సనాతను దాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందే విధంగా ఓఎన్‌జిసి ద్వారా తోడ్పాటు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓఎన్జిసి జియం ఆర్‌యస్.రామారావు, డిజియం స్వామినాథన్, సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ వియస్‌ఎన్ మూర్తి, ఐటీడీఏ పరిపాలన అధికారి డియన్‌వి రమణ, ఎడియంహెచ్‌ఓ జి.ప్రకాశం, ఎస్‌ఓ టీ.మార్తమ్మ, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి. కిషోర్, ఎంపిహెచ్‌ఓ పీటర్, నాగ భూషణం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని శరభవరం గ్రామశివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన శరభవరం గ్రామానికి చెందిన లోతా తమ్మారావు(35) బుధవారం మృతి చెందారు. తమ్మారావు, అతని భార్య అనసూయ పొలం నుండి బైకుపై ఇంటికి వస్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడిపోవడంతో ఈ ప్రమాదం చేసుకుంది. ఎన్‌హెచ్ 516ఈ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు దుమ్ము రాకుండా వాటర్ ట్యాంక్‌తో తడపడం వల్ల తమ్మారావు దంపతులు ప్రయాణించే బైక్ అదుపుతప్పి జారి పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదదంలో గాయపడిన తమ్మారావుకు రాజవొమ్మంగి పిహెచ్‌సి వైద్యాధికారి ప్రథమి చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు రిఫర్ చేయగా అంబులెన్స్ మూడు గంటల పాటు అందుబాటులో లేకపోయింది. అనంతరం 108 వాహనంలో ఆలస్యంగా తరలించగా మంగళవారం రాత్రి మార్గ మధ్యలో తమ్మారావు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తమ్మారావుకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రేషన్ కార్డులను చూపుతున్న సిపిఎం నేత సన్నిబాబు, గిరిజనులు

రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలి

ప్రజాశక్తి పెదబయిలు: మండలంలోని సీతగుంట సచివాలయం పరిధిలో పలు గ్రామాలకు రేషన్ బియ్యం అందలేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బోండా సన్నిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని రోగులపేట, రోగుల కాలనీ, చిట్రాయిపుట్టు గ్రామాలకు చెందిన 150 కుటుంబాలకు మార్చి నెల కోటా బియ్యం అందలేదన్నారు. డిఆర్ డిపో సేల్స్‌మెన్ పై చర్యలు తీసుకుని రేషన్ లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ లబ్ధిదారులకు ఇవ్వాల్సిన బియ్యాన్ని ఒడిశా ప్రాంతాలకు తరలిస్తూ విక్రయిస్తున్నారన్నారు. గతంలో కూడా అనేక సందర్భాల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తుంటే పట్టుకోవడం తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్, పిఓలకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ మేరకు గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీత గుంట వైఎస్ సర్పంచ్ బోండా గంగాధరం, రోగులపేట గ్రామం రేషన్ లబ్ధిదారులు బోండా భీమన్న, బోండా శివ, కించాయి సత్తిబాబు, రేషన్ లబ్ధిదారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సింగిల్ విండో విధానంలో అనుమతులు

-జాయింట్ కలెక్టర్ భావనా వశిస్ట్, పిఓ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: పోలిటికల్ పార్టీల అభ్యర్థులకు సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తామని పాడేరు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావనా వశిస్ట్, అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి ఐటిడిఏ పి.ఓ వి. అభిషేక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బృందాలకు ఎన్నికల పోర్టల్స్ నిర్వహణపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సువిధ, సివిజిల్, ఎన్ కోర్, ఈఎస్‌ఎంఎస్ యాప్‌పై అవగాహన కల్పించారు. సువిధ యాప్ నుండి దరఖాస్తులు స్వీకరించి, ఎన్ కోర్ యాప్ నుండి అనుమతులు జారీ చేస్తామన్నారు. రిటర్నింగ్ అధికారుల ఆమోదం లేకుండా ఎటుంటి అనుమతులు జారీ చేయకూడదన్నారు. సిబ్బంది అనుమతులు జారీ చేయడానికి స్వయం నిర్ణయాలు తీసుకోకూడదని చెప్పారు. అన్ని రకాల ప్రచార కార్యక్రమాలకు రాజకీయ పార్టీల నేతలు రిటర్నింగ్ అధికారుల అనుమతులు పొందాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు ఎన్నికల యాప్‌లపై అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసీలు బివిఎస్ శర్మ, పి.అంబేద్కర్, సిపిఓఎస్. ఎస్. ఆర్.కె. పట్నాయక్, పాడేరు ఎంపిడిఓ సాయి నవీన్, జి.డబ్ల్యూఎస్ జిల్లా సమన్వయకర్త సునీల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి, పిఒ

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి- విఆర్.పురం

ఐక్య పోరాటాల ద్వారానే హక్కుల సాధన సాధ్యమని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సబ్బరావమ్మ అన్నారు. మండల కేంద్రం రేఖపల్లిలో యూనియన్ మండల కార్యదర్శి ఎం.రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుబ్బరావమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలు, సమ్మెలు చేసినా పట్టించుకోని ప్రభుత్వం, రాష్ట్రవ్యాప్తంగా 42 రోజులు నిరవధిక సమ్మె చేయడంతో దిగొచ్చిందని చెప్పారు. సమ్మె విజయవంతం కావడంతో 11 హక్కులను సాధించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సమ్మె సమయంలో ఎన్నో విధాలుగా ప్రభుత్వం అడ్డంకులు కల్పించినా వాటిని లెక్కచేయకుండా, ఉద్యోగాలు తీసేస్తామని బెదిరించినా భయపడకుండా, అంగన్వాడీ సెంటర్ల తాళాలు బద్దలు కొట్టి సచివాలయాలకు అప్పజెప్పినా సరే ఉద్యమం ఆపకుండా పోరాటం చేసి ప్రభుత్వం మెడలు వంచామని పేర్కొన్నారు. దక్కించుకున్న హక్కులు రాబోయే కాలంలో అంగన్వాడీ ఉద్యోగుల భవిష్యత్తుకు ఎంతో తోడ్పడతాయని చెప్పారు. ఈ సమావేశంలో సిఐటియు ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల, కోశాధికారి రామలక్ష్మి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రంగమ్మ, కూనవరం ప్రాజెక్ట్ సెక్రటరీ అన్నపూర్ణ, అంగన్వాడీ టీచర్లు, కనకమహాలక్ష్మి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి

రాజకీయ పార్టీలకు సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-రంపచోడవరం

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగే విధంగా వివిధ రాజకీయ పార్టీలు సహకరించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. బుధవారం తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సార్వత్రిక ఎన్నికలపై సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్లో మొత్తం 11 మండలాలలో 399 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 59 మంది సెక్టర్ అధికారులను రూట్ అధికారులను నియమించామని చెప్పారు. మార్చి 13 నుండి మార్చి 19వ తేదీ వరకు ఫారం-6లు 203, ఫారం-7లు 41, ఫారం-8లు 173 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికలకు ఎక్కడికక్కడ ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, యస్.బొజ్జిరెడ్డి, పి.అనంత మోహన్, చుక్క సంతోష్ కుమార్, పి.కృష్ణారెడ్డి, శ్రీరామ్‌కుమార్, డిప్యూటీ తాసిల్దార్ యన్‌వివి సత్యనారాయణ, సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్లు టీ.లక్ష్మణ్, మణికంఠ పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

చుక్కల జింక మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని సూరంపాలెం గ్రామ శివారు కాలువ వద్ద మృతి చెందిన చుక్కల జింక మృతదేహానికి అటవీశాఖ అధికారులు బుధవారం దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజవొమ్మంగి ఇన్చార్జ్ రేంజర్ సాహెన్ షా మాట్లాడుతూ చుక్కల జింక మృతి చెంది ఉందని స్థానికులు సమాచారం మేరకు అక్కడికి వెళ్లి చూడగా, సుమారు మూడేళ్ల వయసు గల చుక్కల జింక మృతి చెంది పురుగులు పట్టి ఉందని తెలిపారు. వీధి కుక్కలు జింకపై దాడి చేసి ఉండవచ్చన్నారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం చుక్కల జింకకు దహన సంస్కారాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌ఓ రాము పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రానున్న సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో రాజకీయ పార్టీలు నేతలు పోలీస్ అనుమతులు లేకుండా ఎక్కడపడితే అక్కడ సభలు, సమావేశాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రంపచోడవరం ఏఎస్‌పి జగదీష్ అడహళ్లి హెచ్చరించారు. బుధవారం ఆయన రాజవొమ్మంగి సీఐ కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల దృష్ట్యా డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో ప్రతి పోలీస్ స్టేషన్ వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేసినట్లు చెప్పారు. ఎన్‌సీసీ టీమ్ ఎన్ఫోర్స్మెంట్ మీద ఎక్కువ దృష్టి సారించి ఐడి యారక్, బెల్టు షాపులు నిర్వాహణ, గంజాయి రవాణాపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. లైసెన్స్ లేని ఆయుధాలు ఎవరు వద్దన్నా ఉంటే స్వచ్ఛందంగా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో అప్పగించాలని సూచించారు. ఇప్పటి వరకు 150 తుపాకీలు స్వచ్ఛందంగా పోలీస్ స్టేషన్లో అందజేసినట్లు పేర్కొన్నారు. డివిజన్లో 258 పోలింగ్ కేంద్రాలు ఉండగా 101 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు చెప్పారు. స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ఏఎస్‌పి తెలిపారు. ఆయన వెంట స్థానిక సీఐ సన్యాసినాయుడు, రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్‌ఐలు ఎస్ వెంకయ్య, రఘునాథరావు, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ఎఎస్‌పి జగదీష్ అడహళ్లి

రేంజర్‌గా అప్పలనాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-జి.మాడుగుల: అటవీశాఖ రేంజ్ అధికారిగా ఆర్.అప్పలనాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లా రణస్థలం గ్రామం నుండి బదిలీపై వచ్చినట్టు తెలిపారు. అటవీ సంపద తరలిపోకుండా బాధ్యతలు నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవాలు

ఆలయ ప్రాంగణంలో క్యూలో భక్తుల రద్దీ

దర్శించుకున్న డివిజి, ఎస్‌పి

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కళ్యాణోత్సవాల సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి ఉపమాక భక్త జనసంద్రంగా మారింది. నక్కపల్లి నుంచి ఉపమాక వచ్చే రహదారులన్నీ జనం రద్దీతో కిటకిట లాడాయి. స్వామి కల్యాణోత్సవం సందర్భంగా సుదూర ప్రాంతాలు, ఇతర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. భక్తులు బందరు సరస్సులో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, కృష్ణ మాచార్యులు, శేషాచార్యుల నేతృత్వంలో పూజలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలు

హెటిరో డ్రగ్స్ ఉద్యోగుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. నక్కపల్లి శ్రీసత్య సాయి భజన మండలి, సిద్ధి వినాయక యూత్, సర్వేనో సుఖినోభవంతు, మదర్ థెరిస్సా సేవా ఫౌండేషన్, శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం మజ్జిగ, ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

హెటిరో డ్రగ్స్ కంపెనీ డైరెక్టర్ మోహన్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. రాజాం ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కంబాల జోగులు, డివిజి విశాల్ గున్నీ, జిల్లా ఎస్పీ కేవీ మురళీ కృష్ణ, డిఎస్పి జీఆర్ఆర్ మోహన్, సిఐ విజయ్ కుమార్‌లతో పాటు పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగులు స్వామి వారిని దర్శించుకున్నారు. పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ జి ఆర్ ఆర్ మోహన్, సిఐ విజయ కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రియల్ మీ నార్జో 70 ప్రో 5 జి విడుదల

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తక్కువ కాంతిలో ఫొటోగ్రఫీ ప్రమాణాలతో రియల్ మీ నార్జో 70 ప్రో 5 జిని లాంచ్ చేసినట్లు రియల్ మీ ప్రతినిధి తెలిపారు. రూ.18,999 ప్రారంభ ధర అని తెలిపారు. రియల్ మీ నార్జో ఒక స్టైలిష్ స్మార్ట్ ఫోన్ అన్నారు. వినియోగదారులకు మెరుగైన అనుభవాన్ని ఇస్తుందన్నారు.

పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి -యంత్రాంగం



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సిఐ

అనంతగిరి: 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్ కు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో ఇతరులను లోనికి అనుమతించ వద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పరీక్ష కేంద్రం సిఎస్ ప్రసాద్, డిఓ స్వరూపరాణి, ఎంఈఓ బాలాజీ పాల్గొన్నారు.

ముంచింగి పుట్టు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఏఓబి సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు గ్రామ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో మద్యం, డబ్బు, అక్రమ కార్యక్రమాలకు పాల్పడకుండా చర్యలు చేపట్టేందుకు ప్రత్యేకంగా చెక్ గేట్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా రాసేందుకు చర్యలు చేపట్టామన్నారు. జోలాపుట్టు జడ్పీ హైస్కూల్, బోయ్స్ వన్, గర్ల్ వన్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు.

మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు: మన్య ప్రజల ఆరాధ్య దేవత మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహణ కోసం బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు.అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మే నెల 19, 20, 21 తేదీల్లో మూడు రోజులపాటు జరగనున్న ఈ జాతర మహోత్సవా లను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు వర్తక వాణిజ్య ఉద్యోగ, కార్మిక, వ్యాపార వర్గాల వారు అన్ని విధాలుగా సహకారం అందించాలని ఆలయ కమిటీ చైర్పర్సన్ కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి కోరారు . ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవ కమిటీ సభ్యులు సంయుక్తంగా కలిసి నిర్వహించాలని సూచించారు.

ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కొట్టగుల్లి రామారావు, ప్రధాన కార్యదర్సులుగా ప్రసాద్ రావు నాయుడు, శ్రీను, వెంకటరమణలను నియమితులయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కార్యవర్గ సభ్యులుగా మరికొందరినీ నియమించారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కే సింహాచలం నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో భారీ వర్షం

ప్రజాశక్తి -యంత్రాంగం

కోటవురట్ల: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో జనజీవనం స్తంభించింది. కాగా కురిసిన వర్షానికి ప్రధానంగా మెట్ట ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షం నువ్వు చేనుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు చెరువుని తలపించింది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కొత్తకోట: భారీ వర్షానికి రావికమతం మండలం కొత్తకోటలో రోడ్లు జలమయం అయ్యాయి. మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో అకస్మికంగా కురిసిన వర్షం తో గ్రామంలో మురుగునీటి కాలువలు పొంగి రోడ్లపై నుంచి మురుగునీరు పారింది. దీంతో పాదచారులు, వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. స్థానిక గర్రెడ్డి వారి రామకోవెల వద్ద రోడ్లు జలమయం కావడంతో పలు గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

అనకాపల్లిడెస్క్: భారీ వర్షం కారణంగా నర్సీపట్నంలో రోడ్లన్నీ జలమయయ్యాయి. డ్రైనేజీలు పొంగి పొర్లడంతో రోడ్లపైకి చెత్త చెదారం కొట్టుకువచ్చింది. వర్షపు నీరు రోడ్లపై నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. శ్రీకన్య జంక్షన్ వద్ద పరిస్థితి మరీ దారుణంగా మారింది.

రూ.2 లక్షల నగదు సీజ్

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని కాగిత టోల్ గేట్ వద్ద రూ.2 లక్షల నగదును సీజ్ చేసినట్లు సిఐ విజయ్ కుమార్ వెల్లడించారు. మంగళవారం రాత్రి తుని నుండి విశాఖ వెళ్తున్న కారును తనిఖీ చేయగా రూ.2 లక్షల నగదు ఉందని, ఎటువంటి ఆధారాలు లేని కారణంగా సీజ్ చేసామన్నారు. ఈ నగదును మహారాష్ట్రకు చెందిన రితేష్ సీతారాంజి పార్వర్కర్, శక్తి సింగ్ మహేంద్ర సింగ్ కారులో తీసుకు వెళ్తుండగా, వారి వద్ద నుండి నగదు తీసుకొని సీజ్ చేసామని సిఐ వెల్లడించారు.

పథకాలపై ప్రచారం చేయాలి : పైలా

ప్రజాశక్తి-మాడుగుల: గ్యారెంటీ పథకాలను జనసైనికులు ప్రజల్లోకి తీసుకెళ్లి తన గెలుపుకు కృషి చేయాలని టిడిపి, జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు కోరారు. బుధవారం మాడుగుల మండలం ఘాట్ రోడ్డు జంక్షన్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో పైలా ప్రసాదరావును జనసేన సైనికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ, ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో వైసిపి దౌర్జన్య పాలన నచ్చక ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు మండలాల వారీగా చాలా మంది చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ రాయపురెడ్డి కృష్ణ, మండల అధ్యక్షులు గర్రేడ్డి శివాజీ, మండల ప్రధాన కార్యదర్శిలు దాసరి అచ్యుతరావు పాల్గొన్నారు.

ఎం.కోడూరులోని లక్ష్మీనరసింహస్వామిని పైలా ప్రసాద్ దర్శించుకున్నారు. ఆయనతో మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, క్లస్టర్ ఇంచార్జి గొల్లవిల్లి శ్రీరామమూర్తి, నాయకులు మింది వరాహమూర్తి, అప్పాన భాస్కరరావు ఉన్నారు.

ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - చీడికాడ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలు 100 రోజులు విధిగా పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ కే.సరోజిని కోరారు. మండలంలోని జి కొత్తపల్లి గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఆవాలగడ్డ సమీపంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. గ్రామంలో కూలీలందరూ కూడా పని దినాలు వినియోగించుకోవాలని ఆమె కోరారు

విశాఖలో చెడ్డీ గ్యాంగ్ జాడలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో గడిచిన 4 రోజులుగా నలుగురు సభ్యుల 'చెడ్డీ గ్యాంగ్' ముఠా తిరుగుతోందని, అందరూ జాగ్రత్తగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. ఇటీవల విజయనగరం జిల్లా రామభద్రపురం, విశాఖలోని పద్మనాభం పోలీస్ స్టేషన్ పరిధిలోనూ ఈ ముఠా సభ్యులు సంచరించారని తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో వారి జాడలున్నాయని, ప్రధాన రహదారులకు సమీపంలోని ఇళ్లను టార్గెట్ చేసి, ప్రధాన ద్వారాలకు కన్నం పెట్టి తలుపులు తెరిచి లోపలకు ప్రవేశించి ఇంట్లోని వ్యక్తుల్ని భయభ్రాంతులకు గురిచేసి బంగారం, డబ్బు దోచుకుపోతుంటారని వివరించారు. ఈ ముఠా విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో ఉంటున్న వారంతా అపరిచితులు కనిపిస్తే తక్షణమే పోలీస్ కంట్రోల్ రూము నెంబర్ 100కు గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

కిడ్నీ వ్యాధులతో కుదేలు

డయాలసిస్‌కు వేలాది రూపాయల ఖర్చు
పలువురు గిరిజనులు మృత్యువాత
మరో ఉద్దానంలా పాత, కొత్త ధర్మవరం గ్రామాలు

ప్రజాశక్తి -కొత్తకోట: అనకాపల్లి జిల్లా రావికమతం మండలం పాత, కొత ధర్మవరం గిరిజన గ్రామాల్లో పలువురు కిడ్నీ వ్యాధులతో భాధ పడుతున్నారు. గత కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధులకు గురై పలువురు మృతి చెందుతున్నారు. పలువురు గిరిజనులు ఒళ్ళు, కాళ్ళు పొంగడంతో పాటు రక్తహీనత లోపం వంటి వ్యాధులు ప్రబలి తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు.

ఐదేళ్ల కిందట తాజాగా ఏర్పడిన ఈ పంచాయతీలో కొత్త ధర్మవరం, పాత ధర్మవరం గ్రామాలు ఉన్నాయి. ఈ రెండు గ్రామాలలో సుమారు 600 జనాభా ఉంది.పాత ధర్మవరం గ్రామంలో గిరిజన కుటుంబాలు నివసిస్తూ ఉండగా కొత్త ధర్మవరంలో గిరిజన కుటుంబాలతో పాటు బిసి కుటుంబాలు నివసిస్తున్నారు. రెండు గ్రామాలకు తాగునీటి అవసరాల కోసం రక్షిత పథకం నిర్మాణం చేపట్టారు. అదే తాగు నీరు రెండు గ్రామాల ప్రజలు వినియోగించుకుంటున్నారు. అలాగే పాత ధర్మవరం గ్రామానికి సమీపంలో తాగునీటి బోర్ ఉంది. గతంలో ఈ బోరు నుంచి తాగునీరు సేకరణ ఉండేది. ప్రస్తుతం అది వాడిక లేదు.

ఇటీవల పాతధర్మవరం గ్రామానికి చెందిన గత్తెము కొండమ్మ (60) మృతి చెందింది. ఆమె గత కొన్నాళ్ళుగా కిడ్నీ వ్యాదితో భాధ పడింది. అలాగే గ్రామంలో ప్రస్తుతం లగుడు భీమన్న (56) ఈ వ్యాధితో గత ఏడాదిగా భాధ పడుతున్నాడు. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందిన అనంతరం ప్రస్తుతం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వారానికి ఒక సారి డయాలసిస్ చికిత్స చేయించు కుంటున్నాడు. గతంలో డయాలసిస్ చేయించుకోవడానికి ఆసుపత్రికి వెళ్లేందుకు వ్యాధి గ్రస్తునికి అంబులెన్సు సదుపాయం ఉండేది. ప్రస్తుతం ఆ సదుపాయాలు లేక ప్రతి వారం ఆసుపత్రికి డయాలసిస్ పొందేందుకు రూ వెయ్యి రూపాయల ఖర్చులు అవుతున్నాయని, అవి లేని రోజు వైద్య సేవలు పొందలేక పోతున్నామని బాధితుడు భీమన్న వాపోయాడు. గ్రామంలో పాము చిన పెంటయ్య, (60), కుమ్మరి అచ్చిబాబు (64) గత రెండేళ్లు గా కిడ్నీ వ్యాధి లకు గురై మంచాన పడ్డారు.

కొత్త ధర్మవరంకు చెందిన పల్లా మోదునాయుడుకు గత ఆరు నెలల కిందట ఈ వ్యాధి సోకింది. అంతే కాకుండా 40 ఏళ్ళు గత్తెము చిలుకమ్మ (రేషన్ షాప్ డీలర్)గత అరేళ్లు గా ఈ వ్యాధి కి గురై ఇబ్బంది పడుతోంది. ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అయినా ఆమె ఆరోగ్యం కుదుట పడలేదు. గతంలో గత్తెము చిన నూకరాజు, చీమల వీరేషమ్మ ఈ వ్యాధి తో మృతి చెందారు.ఈ వ్యాధులకు బయ పడిన కొంత మంది యువత ఊరు వదిలి మరో చోటుకు తరలి పోతున్నారు. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ లేక పోవడం పై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలి

ఎందుకు ఇలా వ్యాధులు సోకుతున్నాయి అన్నది అర్థం కావడం లేదు. గత కొన్నాళ్ళు గా ప్రతి ఇంటికి ఒకరు కిడ్నీ సమస్యతో భాధ పడుతున్నారు. గతంలో చాలా మంది మృత్యు వాత పడ్డారు. తాగునీరు పరీక్షలు కూడా జరిగాయి. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలి. లేదంటే గ్రామంలో నివాసం ఉండడానికి ప్రజలు భయపడు తున్నారు.

గత్తెము రాజ్యలక్ష్మి, సర్పంచ్
ధర్మ వరం గ్రామం

అధికంగా ఖర్చులు

పేదలకు కిడ్నీ సమస్య లు రావడం తో మంచానికి పరిమితం అవుతున్నారు. విశాఖ వంటి నగరాలకు వెళ్లి వైద్యం పొందాలంటే ఖర్చుతో కూడిన పని. కొందరు ఖర్చులకు లేక వైద్యం సేవలకు దూరం అవుతున్నారు... వైద్య ఆరోగ్య శాఖ చొరవ తీసుకోని గ్రామంలో ఈ వ్యాధులు ఎందుకు సోకుతున్నాయో సమగ్రంగా సర్వే చేయాలి... డయాలసిస్‌కు వెళ్లే భాదితులకు అంబులెన్సు సదుపాయం కల్పించాలి...

పల్లా సింహాద్రి,
ఉప సర్పంచ్.. ధర్మ వరం

ఆఫ్‌లైన్‌లో రేషన్ బియ్యం పంపిణీ



రేషన్ బియ్యం పంపిణీని పర్యవేక్షిస్తున్న సిఐ, ఎస్ఐ

ప్రజాశక్తి -సీలేరు : పోలీసుల చొరవతో జికె.వీధి మండలం గాలికొండ పంచాయితీలో ప్రజలకు రేషన్ బియ్యం ఆఫ్‌లైన్ విధానంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జికె.వీధి సిఐ అశోక్ మాట్లాడుతూ గాలికొండ పంచాయితీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాల్లో కొన్ని నెలలుగా బియ్యం పంపిణీ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకురాగా, తాము జీకే వీధి మండల తహశీల్దారుకు తెలియజేశామని చెప్పారు. ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో ఆన్‌లైన్ విధానం వల్ల ప్రజలకు బియ్యం పంపిణీ జరగడం లేదని, ఆఫ్‌లైన్ విధానంలో బియ్యం పంపిణీ చేసే విధంగా చొరవ చూపాలని తాము కోరామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆఫ్‌లైన్ విధానంలో బియ్యం పంపిణీ చేసినందుకు తహశీల్దారు చర్యలు చేపట్టారని తెలిపారు. బుధవారం గాలికొండ పంచాయతీ పరిధిలోని మైనికోట, బుగ్గరాయి, గుర్రాలగొంది, గొడుగురాయి, సప్తపాడు, బత్తునూరు, శిలక వీధి గ్రామాల ప్రజలకు బియ్యం పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ విజయకుమారి

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని ఎం.మాకవరం, నడింపాలెం, లూసం, బలభద్రం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను బుధవారం ఐసీడీఎస్ సీడీపీవో విజయ కుమారి సందర్శించారు. ముందుగా ఆయా కేంద్రాల్లోని రికార్డులను తనిఖీ చేసిన సీడీపీవో, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహారం తీసుకోవడం గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. వెయ్యి రోజుల లోపు పిల్లల పోషణ, ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

మండలంలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలంలో బుధవారం మధ్యాహ్నం కొన్నిచోట్ల భారీ, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసింది. పది రోజులుగా మండలంలో తీవ్రమైన ఎండ కాస్తోంది. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని, మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. బుధవారం మధ్యాహ్నం వర్షం కురవడంతో వాతావరణం కాస్త చల్లబడి ఊరట లభించింది. భారీ వర్షాలు కురిస్తే జీడిమామిడి తోటలకు అనుకూలంగా ఉంటుందని గిరిజన రైతులు అంటున్నారు.

గీతం ఎంబిఎ కోర్సులలో అడ్మిషన్లకు

24న జాతీయస్థాయి ప్రవేశపరీక్ష

ప్రజాశక్తి -మధురవాడ : గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహిస్తున్న ఎంబిఎ కోర్సులలో ప్రవేశాలకు గీతం బిజినెస్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్-2024 (జిబాట్)ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. బుధవారం గీతంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిరచారు. జిబాట్-2024 ప్రవేశ పరీక్షను ఈ నెల 24న దేశ వ్యాప్తంగా 80 పట్టణాలలో ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామన్నారు. రెండు గంటల కాలవ్యవధి గల ఈ ప్రవేశ పరీక్ష 200 మార్కులకు ఉంటుందన్నారు. ఎంబిఎలో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్ సప్లైచైన్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రీసోర్స్, ఇంటర్నేషనల్ బిజినెస్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఎకౌంటింగ్ స్పెషలైజేషన్‌లను ఆఫర్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎంబిఎ హెల్త్‌కేర్, హస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. విశాఖలోని ఎపి మెడ్‌టెక్‌జోన్‌తో కలిసి ఈ కోర్సును రూపొందించి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

డిగ్రీలో ఉత్తీర్ణులై, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 24న జరిగే జిబాట్-2024కు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ప్రవేశ పరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా వ్యక్తిగత ఇంటర్వ్యూలను నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు గీతం వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహించే కోర్సులలో కేస్ స్టడీస్ ఆధారంగా విద్యార్థుల నైపుణ్యాలను పెంచడంతో పాటు ప్రతి విద్యార్థిపైన వ్యక్తి గత శ్రద్దను చూపుతున్నట్లు డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు.

విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి వెంచర్ డవలప్‌మెంట్ సెంటర్ (విడిసి) ద్వారా కృషి చేస్తున్నామన్నారు. ఎంబిఎ విద్యార్థుల శిక్షణకు ఎనలిటిక్స్ ప్రయోగశాల, అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ మరియు బ్లూంబర్గ్ తో కలసి పనిచేస్తున్నామని వెల్లడిరచారు. సమావేశంలో డాక్టర్ వెంకటేశ్వరులు, డాక్టర్.బంగారరాజు, ప్రొఫెసర్ పి.శీలా, జగదీష్, డాక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గీతం బిజినెస్ స్కూల్ డీన్ రాజా ఫణి పప్పు

జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

22న దాఖలుకు తుది గడువు : తొలిరోజు ఉత్సాహం నామినేషన్లు

ప్రజాశక్తి - విశాఖ లీగల్ : ప్రతిష్టాత్మకమైన విశాఖపట్నం జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలకు బుధవారం నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 22 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉందని ఎన్నికల అధికారి సీనియర్ న్యాయవాది కె.నరసింహమూర్తి తెలిపారు. బుధవారం తొలిరోజున పలువురు ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేశారు.

నామినేషన్లు వేసిన వారిలో అధ్యక్ష పదవికి నమ్మి సన్యాసిరావు, తాళ్లూరు రవికుమార్ నామినేషన్లు వేయగా, ఉపాధ్యక్ష పదవికి ఎస్‌టిపి గోపాలక్ష్మ, ప్రధాన కార్యదర్శిగా కె రవిశంకర్, గుడిపల్లి సుబ్బారావు, కోశాధికారి పదవికి టి.బోసుబాబు, జాయింట్ సెక్రెటరీ పదవికి అడపా సుధాకర్ నామినేషన్ దాఖలు చేశారు. జూనియర్ నెంబర్లుగా కె శ్రీనివాసరావు, వి కుమారస్వామి, ఎం వెంకటరమణ, పి రమాదేవి, సీనియర్ సభ్యురాలిగా కె హేమామాలిన నామినేషన్ వేసినట్లు ఎన్నికల అధికారి నరసింహమూర్తి వెల్లడించారు.

డైట్‌లో ఘనంగా పిచ్చుకల దినోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం :స్థానిక ప్రభుత్వ డైట్‌లో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ అధ్యాపకులు గొట్టేటి రవి మాట్లాడుతూ, పిచ్చుకలు ఆహారంగా తినే చిన్న క్రిములు, కీటకాల వల్ల జీవ వైవిధ్య సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. పంట పొలాలకు చీడపీడల నుంచి ముప్పు తగ్గించి, ఆహార భద్రతకు పిచ్చుకలు దోహదపడతాయన్నారు. దాదాపు 35 జాతుల పిచ్చుకలు పక్షుల్లో చిన్నవిగా ఉంటాయని, గంటకు 50 కిలో మీటర్ల వేగంతో ఎగురుతాయని వివరించారు. జీవవైవిధ్యానికి మేలు చేసే పిచ్చుకల ఉనికి నేడు ప్రశ్నార్థకంగా మారిందని, దానికి మానవాళి జీవనశైలి కారణం కావడం గమనార్హమన్నారు. ఛాత్రోపాధ్యాయిని రితీషా మాట్లాడుతూ, నేటి జీవనశైలిలో చోటుచేసుకున్న మార్పులు పిచ్చుకలపై బ్రహ్మాస్త్రంగా పరిణమిచాయన్నారు. పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, మితిమీరిన రసాయనాల వినియోగం, సెల్‌టవర్ల రేడియేషన్ పిచ్చుకల జాతి అంతానికి కారణభూత మౌతోందని ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్ త్రినాథరావు, ఎం మహాలక్ష్మి, జె మాధవి పాల్గొన్నారు



మాట్లాడుతున్న డైట్ అధ్యాపకుడు గొట్టేటి రవి

సురేంద్రకు జెన్‌కో అధికారుల నివాళి



సురేంద్ర మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎపి జెన్‌కో అధికారులు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో కాంటాక్ట్ కార్మికుడు పాంగి సురేంద్ర అనారోగ్యంతో మృతి చెందగా, బుధవారం ఏపీ జెన్కో ఎస్ఇ సివిల్ ఎకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈ సివిల్ ప్రభాకర్, ఎఇ సురేష్ ఘనంగా నివాళు లర్పించారు. సురేంద్ర కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అంత్యక్రియల నిమిత్తం అధికారులు రూ.5వేలు ఆర్థిక సాయాన్ని సురేంద్ర కుమారుడు గోపికి ఈఈ ప్రభాకర్ అందజేశారు. తోటి కాంట్రాక్ట్ కార్మికులు, ఏపీ జెన్కో యూనియన్ నాయకులు, ఇంజనీర్లు సురేంద్ర మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీలేరు యుసిఐఎం చర్చ సమీపంలో ఉన్న క్రైస్తవుల శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూసిఐఎం చర్చి పాస్టర్ మనసై, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -ఆనందపురం :రానున్న ఎన్నికలు దృష్ట్యా మహిళా పోలీసులందరూ అప్రమత్తంగా ఉండాలని ఎసిపి బి.సునీల్ సూచించారు. బుధవారం సాయంత్రం ఆనందపురం పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసులకు ఎన్నికల విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారాన్ని అందించాలన్నారు. ఎన్నికల సమయంలో జాగ్రత్తలు వహించి, శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే అప్రమత్తపై పోలీస్‌స్టేషన్‌కు సమాచారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆనందపురం సిఐ టివి.తిరుపతిరావు. ఎస్ఐ గంట్యాడ సంతోష్, సిబ్బంది గాంధీ పాల్గొన్నారు.

532 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలంలోని బచ్చింత గ్రామ శివారులలో 532 కిలోల నిల్వ ఉంచిన గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చింతపల్లి ఎఎస్‌పి కే.ప్రతాప్ శివ కిశోర్ తెలిపారు. గంజాయి నిల్వ ఉందన్న ముందస్తు సమాచారంతో సీఐ పి.వెంకటరమణ, ఎస్సై రామకృష్ణ, మంప ఎస్సై లోకేష్ కుమార్ తమ సిబ్బందితో బుధవారం దాడులు నిర్వహించి గంజాయి స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. అనంతరం గంజాయి నిల్వ ఉంచిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని తెలిపారు.